స్కెచ్

# సంజీవయ్య సాహస చర్య

"పూభా"

'గడియారం ముళ్ళు బరువెక్కి పోయాయి కామోసు ఆరునుంచి పన్నెండు వరకూ ఎంతకీ కదలకుండా ఉన్నాయి. సైకిలు మల్లే ఎత్తు ఎక్కడం గడియారం ముళ్ళకీ కష్టమే కామోసు' అని గొణుక్కుంటూ హెడ్ గుమస్తా గదిలోఉన్న గోడ గడియారాన్ని చూసి తన గదిలోనికి వెళ్ళిపోయాడు సంజీవయ్య.

మరొకసారివచ్చి చూసాడు.

యింకా పెద్దముల్లు పన్నెండు చేరుకోలేదు.

అప్పటికి నాలుగు సార్లయింది గడియారాన్ని చూట్టం.

యింకొకసారి వెళ్ళిచూసి తిరిగివచ్చేస్తున్నాడు సంజీవయ్య.

"ఏమండోయ్ యిలా ఓ మారురండి" అది హెడ్ గుమాస్తా కంఠం.

"ఎబౌటర్న్" అని విన్న సోల్జరు మల్లే ఠకీమని వెనక్కితిరిగివచ్చి హెడ్ గుమస్తా దగ్గర నిలబడ్డాడు.

"యీవాళ మీరేం పనిచేసినట్టు కనిపించదు, అటూ యిటూ తిరగడమే కనిపిస్తోందిగాని."

ఎంత పనిచేసినా అది హెడ్ గుమస్తా మామూలుగా అనే మాటే అది.

అయినా సంజీవయ్యకు ఏమనాలో తోచలేదు, తోచినా ఎదురు జవాబు చెప్పేందుకి దమ్ములేదు.

"యిప్పటి కప్పుడే నాలుగైదుసార్లు యిక్కడకువచ్చి వెళ్ళడం చూసాను."

తను అలా వచ్చినందుకు సంజాషీ చెప్పమని అది లౌక్యంగా అడగడమని సంజీవయ్యకు తెల్సు.

"టైం చూద్దామని వచ్చానండి"

"ఏం అయిదవగానే యింటికి వెళ్ళిపోదామని కొత్తగా నేర్చుకున్నారేమిటి టైం ప్రకారం పని చేద్దామని."

"అది కాదుసార్. యీ వాళ యింటిదగ్గర కొద్దిగాపనుంది. అందుచేత అయిదవగానే తమతో చెప్పి permission తీసుకుని వెడదామని."

"ఆ సంగతి నాకేం తెలియదు. ఆఫీసరుగారు వస్తారు. వారితో చెప్పి వెళ్ళిపోండి. అతనువచ్చేసరికి అందరూ హాజరుగా ఉండాలని వారు ఖచితంగా చెప్పారు. అది మీకు తెల్సు కూడా. అందుచేత ఆ Risk నేను తీసుకోను!"

సంజీవయ్య seat తనదగ్గరకు వెళిపోయాడు.

ఆఫీసరు రావటం—అతను అయిదు గంటలు దాటితేనేకాని ఎప్పుడూరాడు. పన్నెండుగంటలకు భోంచేసి, ఒంటిగంటనుంచి నాలుగ్గంటల వరకూ హాయిగా పడుకుని, లేచి ముస్తాబై, టీ త్రాగి తాపీగా బయలుదేరి అయిదుగంటలనుంచి ఆరు గంటలలోపుగా ఎప్పుడైనా రావచ్చు. నిరుత్సాహంగా కుర్చీలో కూర్చున్నాడు. గాలికి రెపరెపమని కొట్టుకుంటున్న టేబిలుమీద కాయితాలు తనని అవహేళన చేస్తున్నట్టున్నాయి.

ఆఫీసుకు బయలుదేరుతున్నప్పుడు చేతికి ఫ్లాస్కు అందిస్తూ శ్రీమతి మరీమరీ చెప్పింది.

ఏమంత పెద్దకోరిక అని అది!

కాస్త వేగిరం రమ్మనమని.

తన అస్వతంత్ర జీవిత నగ్నరూపాన్ని గమనించలేక "ఊఁ" అన్నాడు.

కారు హారన్ వినిపించింది.

త్రుళ్ళిపడ్డాడు.

ఆఫీసరు వస్తున్నాడు.

ఎలాగువెళ్ళి approach అవడం అని ఆలోచిస్తున్నాడు. ఆఫీసరు వచ్చేసాడు.

ఆఫీసు నిశ్శబ్దంగా ఉంది.

పాదద్వయము నేలమోపి పవనుసంబంధించి లేచాడు.

ఏ పని చేసినా ముందుగా హెడ్ గుమాస్తాకి తెలియబర్చకుండా చెయ్యడం మంచి పనికాదు. దానివల్ల చాలా చిక్కులున్నాయి. ఆ సంగతి సంజీవయ్యకి తెల్సు. అందుకని హెడ్ గుమస్తా దగ్గరకువెళ్ళి "ఒకసారి ఆఫీసరుగారి దర్శనంచేసి వారి Permission తీసుకుంటాను" అన్నాడు.

"ఇప్పుడే వచ్చారు. వెంటనేవెళ్ళి అడిగితే ఏమనుకుంటారో. అయినా వెళ్ళిచూడండి. యీ వాళ అర్జంటుగా కాయితాలన్నీ పడేశారుకదూ"

"అర్జంట్లన్నీ అయిపోయాయండి"

"సరే వెళ్లు" అన్నాడు హెడ్ గుమాస్తా.

బంట్రోతు అప్పలస్వామినిపిలచాడు సంజీవయ్య.

"అయ్యగారు ఏంచేస్తున్నారోయ్"

"పేపరు చూస్తున్నారు"

"ఎలాగున్నారు"

"బాగానే ఉన్నారు"

"కోపంగా లేరు గద"

"లేదులెండి"

"ఒకసారి నేను వారిదర్శనం చేస్తానని చెప్పు".

అప్పలస్వామి వెళ్ళివచ్చి "రమ్మంటున్నారు వెళ్ళండి" అన్నాడు.

జంకుతూ జంకుతూవెళ్లి నమస్కారంచేసి చేతులు కట్టుకుని నిలబడ్డాడు.

'What is the matter' అన్నాడు ఆఫీసరు సంజీవయ్య వైపుచూసి తిరిగి న్యూస్ పేపరు చూసుకుంటూ.

'యీవాళ యింటిదగ్గర కొద్దిగా పనుందిసార్ కాస్త త్వరగా యింటికి వెళ్లడానికి శలవు యిప్పిస్తారని మనవిచేస్తున్నాను'

'హుఁ' అన్నాడు ఆఫీసరు.

'చిత్తం' అన్నాడు సంజీవయ్య.

'నేను యిక్కడ వున్నప్పుడు మీరందరూ వుంటేనే నాలుగు కాయితాలూ చూసుకోవచ్చునని నేను చెపితే ఏదో సాకుపెట్టుకుని యిలా చేస్తే ఎలాగ' అన్నాడు.

సంజీవయ్య ఏమీ జవాబు చెప్పలేదు.

'సరే వెళ్ళండి. వెళ్ళండి'

'శలవ్' అనుకుంటూ నమస్కారంచేసి యింటికి బయలుదేరాడు కళింగయుద్ధం జయించిన అశోకుడిలా అతనిలో విజయగర్వంలేదు.

యింటికి వస్తున్నాడన్న మాటేగాని 'సరే వెళ్లండివెళ్లండి'అన్న ఆఫీసరుమాటలు మామూలుగా వెళ్ళమనో లేక సరేవెళ్లు నీసంగతిచూస్తాను అన్న అర్థంతో అన్నవో అర్థంకాలేదు సంజీవయ్యకి.

---

అంతర్ముఖుడి స్వగతం

# లెఖ్ఖలు చెప్పే నేను

## బందా వెంకటసుబ్బారావు

**THE real resources ultimately will be the bright young men, people with a sense of dedication to their work, to the search for truth, to the discovery of the secrets of the universe for the public good.**

**—Jawaharlal Nehru.**

చుట్టూ ఆవరించిన చీకటిని చీల్చిమెరిసే వెలుగు రేఖవంటిది పైవాక్యం. అందునా, ఎదుగు బొదుగులు లేకుండా, ఎడతెరపి లేకుండా, పాడిందేపాడుకుంటూ, చెప్పిందే చెప్పుకుంటూ, కొద్దిమందికి రుచించినా చాలమందికి గగుర్పాటు కలిగించే పచ్చికాకరకాయ లాంటి సబ్జక్టు చెప్పుకునే లెక్కలమేస్టరు జీవితానికి ఒక ఆలంబనము. అందరు మేస్టర్లలోను యీతడిదొక ప్రత్యేక ప్రకృతి. దుక్కలాంటి లెఖ్ఖలమేస్టరు చాలా దుర్లభుడు. ఉస్సురంటూ బక్కచిక్కి, గొరగని గడ్డం, మార్చని బట్టలు, ఏమిటో గొణుక్కుంటూ, ఏవో అలౌకికమైన వాట్లయందు లగ్నమైన ధ్యానముద్రను తెలిపే నేత్రద్వయంతో ఫలానా అని చెప్పకయే చెపుతుంది అతడి వేషం. హాస్యరసంతోనూ ఉపాఖ్యానాలతోనూ హరికథలా కాలక్షేపం చేయడానికి వీలులేని విషయాన్ని బోధించుట చేతనూ, అర్హతగల స్టెప్పులేకుండా అరమార్కైనా అదనంగా ఆశ్రితులకు అనుగ్రహించక పోవుటచేతనూ, అర్థిజన కుముదములకు అరుణోదయంలాంటివాడని, నిర్దయుడని, పిల్లలులేనివాడని (గంపెడున్నా), అపవాదులకు పాల్పడుతుంటాడు. అలాంటివాని జీవితం ఒక నిష్కామసేవగా, మానవసంఘాన్ని ముందుకునడిపే మహామహులలు సృష్టించే కర్మరంగంగా చిత్రించేవాక్యం అది.